విక్రమ్‌రెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

విక్రమ్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

తుంగతుర్తి, ఏప్రిల్ 5: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, తిరుమలగిరి వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ దాయం విక్రమ్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం విక్రమ్‌రెడ్డి భౌతికకాయానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ విక్రమ్‌రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో ప్రతిక్షణం వెంపటి గ్రామాభివృద్ధి కోసం పాటుపడ్డారని, ఆయన మరణం తీరని లోటన్నారు. జగదీశ్‌రెడ్డి వెంట బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, ఎస్‌కే.రజాక్, రఘునందన్‌రెడ్డి, జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, దుపటి రవి, శ్రీరాంరెడ్డి, సాయిలు, యాదగిరి, జేడి భిక్షం, నెమ్మాది భిక్షం, రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సామాజిక చైతన్యం కలిగి ఉండాలి

● అనురాగ్ కళాశాల వార్షికోత్సవంలో వి.వి.లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి

ప్రసంగిస్తున్న కళాశాల కరస్పాండెంట్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి

అనంతగిరి, ఏప్రిల్ 5: విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యం కలిగి ఉండాలని, చేసే పనిపై ఏకాగ్రత వహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సీబీఐ మాజీ జేడీ, జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుబు వి.వి లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో వార్షికోత్సవం శనివారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యా, సామాజిక సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాలని సూచించారు. డ్రగ్స్, బెట్టింగ్‌కు ఆకర్షితులవకుండా లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో గొప్ప వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేయాలని తెలిపారు. పుట్టిన ఊరు, కళాశాల పేరును ప్రపంచ పటంలో నిలపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి, విద్యార్థులకు వారు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈపామ్ సిస్టమ్స్ అధిపతి ఇమాన్యుయల్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సురేశ్, చిన ఈశ్వరయ్య, కళాశాల సొసైటీ కోశాధికారి వేనేపల్లి వెంకటేశ్వరరావు, భూపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతి, టీపీఓ విద్యాసాగర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

● ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

తుంగతుర్తి, ఏప్రిల్ 5: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఏనకుంట తండాలోని ఎండిన పొలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం వినూత్న ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల కాలంలో ప్రజలను ఎలా మోసం చేసిందనేది విషయాలను రజతోత్సవ సభ ద్వారా కేసీఆర్ వివరిస్తారని.. సభకు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని రమేశ్, పూర్ణానాయక్, రమేశ్‌నాయక్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర రాక రైతులు విలవిల

● మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 5: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర రాక రైతులు విలవిలలాడుతున్నారని హుజూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా వరి కోతలు మొదలై 20 రోజులవుతున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీంతో రైతులు రైస్ మిల్లులను ఆశ్రయించడంతో మద్దతు ధర రావడం లేదని పేర్కొన్నారు. మిల్లర్లు, ప్రభుత్వం చేతిలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మిల్లర్లతో మాట్లాడి ధర స్థిరీకరణ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డిని నమ్మి రైతులు మోసపోయారని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ అన్నెం శిరీషకొండారెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు సారెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామల హరిలీల, బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కోదాడ రూరల్, ఏప్రిల్ 5: యువత క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ కోదాడ పట్టణాధ్యక్షుడు ఎస్‌కే.నయీం అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా పట్టణ పరిధిలోని తమ్మర సుందరయ్య కాలనీలో మదర్ థెరిసా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు కర్ల సుందర్‌బాబు, యువజన నాయకుడు, బహుమతి దాత ఎస్‌కే.అబ్దుల్ ఆలీమ్, నిసార్, దస్తగిరి, జమీర్, అబ్బు, బొజ్జా నరేశ్, బాపట్ల శ్రీకాంత్, తిరుపతయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయినది
కక్కిరేణి దనలక్ష్మి, W/o.రాజు (Late) R/o.H.No.1-2-146/A1, KK రోడ్డు, సూర్యాపేట డాక్యుమెంట్ నెంబర్ 5611/1992, అను పేరుగల ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్ స్కూటర్‌పై వెళ్ళుతుండగా మార్గమధ్యలో పోయినది దొరికినవారు సంప్ర|| సెల్:9948323485.

WANTED
★ Wanted Sales Executives @ Miryalaguda,
Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals.
Ph: 9573244611, raju@unicchem.com
NT-330933

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి జగ్జీవన్‌రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి లత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌నాయక్, ఎస్టీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శంకర్‌నాయక్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి నరసింహారావు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ, పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, టీఎన్‌జీఓ సెక్రటరీ దున్న శ్యామ్, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

తుంగతుర్తి: మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీచర్ పాల్వాయి గురవయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని రమేశ్, కొండగడుపు వెంకటేశ్, బొంకూరి మల్లేశ్, బొజ్జ సాయికిరణ్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మునగాల: మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాళ్

పలు మండలాల్లో..

సూర్యాపేట/నేరేడుచర్ల/తిరుమలగిరి/కోదాడ: జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో బాబూ జగ్జీవన్‌రామ్‌కు పలు శాఖల అధికారులు, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఘన నివాళులర్పించారు. నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ రూరల్, మఠంపల్లి, గరిడేపల్లి, మేళ్లచెర్వు, కోదాడ రూరల్, చివ్వెంల, తిరుమలగిరి, అర్వపల్లి, మునగాల, కోదాడ టౌన్, సూర్యాపేట రూరల్, పెన్‌పహాడ్, నాగారం, మోతె, చిలుకూరు, సూర్యాపేట అర్బన్ మండలాలు, పట్టణాల్లో జగ్జీవన్‌రావ్ జయంతిని నిర్వహించారు.

మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 5: ఒక విజయం సాధించిన సంతోషం ఉంది కానీ తన జాతి బిడ్డలకు సంపూర్ణ విజయం చేకూరలేదనే బాధ వేధిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. దాతల సహకారంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఆగస్టు 1న సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన రోజున సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో అందరి కంటే ముందు ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి గత ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేయలేదని అన్నారు. మాల పెద్దల కుట్రల ఫలితంగా వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయకుండానే 40 వేల ఉద్యోగాలు భర్తీ చేశారని, దీంతో మాదిగ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇది మాదిగ జాతికి కాంగ్రెస్ పార్టీ చేసిన నష్టమే అన్నారు. సాధించిన ఫలాలు మాదిగ బిడ్డలకు అందాల్సిన సమయంలో మాలల ఒత్తిడికి తలొగ్గి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ విజయంలో సూర్యాపేట పాత్ర కీలకమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు గుద్దేటి యల్లయ్య, చింతలపాటి చిన శ్రీరాములు, యాతాకుల రాజన్న, చింత వినయ్‌బాబు, ఎర్ర వీరస్వామి, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ కౌన్సిలర్ వల్దాస్ సౌమ్యాజాని పాల్గొన్నారు.

'ప్రభుత్వ విద్య బలోపేతానికి పాటుపడాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 5: కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు కోరారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో 2024 డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు పాఠశాలల నిర్వహణ, సర్వీస్ నిబంధనలు, సెలవుల నిబంధనలపై శనివారం జిల్లా కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దాలని అన్నారు. కాగా, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు రెండు జతల యూనిఫాం అందించాలని, మధ్యాహ్న భోజన చార్జీలను పెంచాలని, ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని, పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా నూతన పీఆర్సీ రిపోర్టును వెంటనే ప్రకటించి, పెండింగ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ బిల్లులనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్, జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, జె.యాకయ్య, పి.శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకటయ్య, పి.క్రాంతికుమార్, ఆర్.దామోదర్, బి.ఆడం, రవీందర్, సాంబయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మహిళలు నైపుణ్యాభివృద్ధి శిక్షణను వినియోగించుకోవాలి

● బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కృపాకర్

శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో గండూరి కృపాకర్ తదితరులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 5: మహిళలు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి చార్టర్ ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ భగవాన్ ఆయుర్వేదిక్ భవనంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసి, మగ్గం వర్క్స్ తరగతులను వారు శనివారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదిగేందుకు ఈ ఉచిత శిక్షణ తరగతులు తోడ్పడుతాయని తెలిపారు. మూడు నెలలు పాటు తరగతులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బి.శ్రీదేవి, తన్నీరు ప్రమీల, కేతిరెడ్డి పద్మ, పగిళ్ల రేణుక, గుండపనేని లక్ష్మి, శ్రీరామదాసు రేణుక, మహిళలు పాల్గొన్నారు.

'తేజ' విద్యార్థులకు బంగారు పతకాలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 5: న్యూఢిల్లీకి చెందిన ఎస్‌ఓఎఫ్ సంస్థ గతేడాది డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు సమకాలీన రాజకీయ, శాస్త్ర, సాంకేతిక, క్రీడా రంగాలపై పోటీలను నిర్వహించింది. ఇటీవల విజేతల వివరాలను వెల్లడించింది. ఈ పోటీల్లో కోదాడలోని తేజ విద్యాలయానికి చెందిన 11 మంది విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ రమాసోమిరెడ్డి శనివారం తెలిపారు.

ఆర్థిక సాయం

నడిగూడెం, ఏప్రిల్ 5: మండల కేంద్రానికి చెందిన దేవరంగుల ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు శనివారం రూ.2 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్, బడుగుల వెంకటేశ్, రఫీ, జలీల్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ధర్నా'ను విజయవంతం చేయాలి

కోదాడ రూరల్, ఏప్రిల్ 5: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలనే డిమాండ్‌తో ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ప్రజా ధర్నాను విజయవంతం చేయాలని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి కోరారు. ఈ మేరకు శనివారం కోదాడలోని లాల్‌బంగ్లా వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులతో కలిసి ధర్నా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ సంపదను బహుళ జాతి కంపెనీలకు దోచిపెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆరోపించారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ధర్నాలో సకలజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉదయగిరి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తికి తీవ్రగాయాలు

గరిడేపల్లి, ఏప్రిల్ 5: ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని వెలిదండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలిదండ గ్రామానికి చెందిన గుండు రాంబాబు ట్రాక్టర్‌తో పొలంలో మట్టి తోలుతూ రివర్స్ తీస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తాపడి రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్ కింది నుంచి రాంబాబును బయటకు తీసి 108 అంబులెన్స్ వాహనంలో తొలుత హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

-ఎంఈఓ సలీం షరీఫ్

కోదాడ టౌన్, ఏప్రిల్ 5: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని ఎంఈఓ సలీంషరీఫ్ అన్నారు. కోదాడలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని అన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఏజీఎం మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ గోపాలస్వామి, ఆర్‌ఐ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుమలగిరి, ఏప్రిల్ 5: సీఎంఆర్‌ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కేసులు : ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 5: గొడవలు, నేరాలకు పాల్పడే వారిపై కేసులు తప్పవని ఎస్పీ నరసింహ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో శనివారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడానికి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా, కార్డన్ సెర్చ్‌లో అనుమతి పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, అక్రమంగా నిల్వ ఉంచిన 9.5 లీటర్ల మద్యం, 17 బీర్ బాటిళ్లు సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ వీర రాఘవులు, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీఓ

కోదాడ రూరల్, ఏప్రిల్ 5: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏపూరి తిరుపతమ్మ అన్నారు. మండల పరిధిలోని తొగర్రాయి, తమ్మర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓ.శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ బుడిగం నాని, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఇర్ల సీతారాంరెడ్డి, కమతం వెంకటయ్య, బొల్లు ప్రసాద్, కనగాల నారాయణరావు, కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి : మండల వైద్యాధికారి

నూతనకల్, ఏప్రిల్ 5: వేసవి కాలం దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారిణి ఆశ్రితరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఉపాధి పనులకు వెళ్లే కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ చరణ్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాలకవీడు, ఏప్రిల్ 5: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని శూన్యపహాడ్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన వట్టె నాగరాజు(37) ఈ నెల 4వ తేదీన గరిడేపల్లి మండలం కల్మలచెర్వు గ్రామంలో తన బంధువు అంత్యక్రియల కార్యక్రమానికి బైక్‌పై వెళ్లాడు. కార్యక్రమం అనంతరం మరో వ్యక్తితో కలిసి దాచేపల్లి గ్రామానికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కాగా, సాయంత్రం వరకు నాగరాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో నాగరాజు తమ్ముడు గంగరాజు దామరచర్ల వద్ద వెతుకుతుండగా శూన్యపహాడ్ గ్రామ శివారులో ఒక వ్యక్తి తలకు తీవ్రగాయాలై పడిపోయినట్లు సమాచారం అందడంతో వెళ్లి చూడగా అప్పటికే తీవ్ర రక్తస్రావంతో నాగరాజు మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు గంగరాజు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 5: రోడ్డు ప్రమాదంలో యువతి మృతిచెందిన ఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో ఉన్న సెవెన్ స్టార్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పిల్లలమర్రి గ్రామానికి చెందిన దాసరి విజిత సెవెన్ స్టార్ హోటల్‌లో పని చేస్తుంది. విధులకు వెళ్తూ హోటల్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో విజిత అక్కడికక్కడే మృతిచెందింది.

గాజు సీసాలో సీతారాముల ప్రతిమలు

సీసాలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి ప్రతిమలు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 5: జిల్లా కేంద్రంలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన కూరెళ్ల పోతులూరాచారి గాజు సీసాలో సీతారాముల ప్రతిమలను తయారు చేసి ఔరా అనిపిస్తున్నారు. వృత్తి రీత్యా కార్పెంటర్ అయిన పోతులూరాచారి వివిధ ప్రతిమలను సీసాల్లో తయారు చేయడం అలవాటుగా చేసుకున్నారు. గతంలో అనేక మంది రాజకీయ నాయకులు, జాతీయ నాయకుల ప్రతిమలను సీసాల్లో తయారు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా బాల రాముడు, శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి ప్రతిమలను సీసాలో తయారు చేసి ప్రదర్శించారు. ఒక్కో ప్రతిమను సీసాలో ఉంచేందుకు 20 రోజుల చొప్పున శ్రమించినట్లు ఆయన తెలిపారు.

అస్తవ్యస్తంగా రైతు వేదికల నిర్వహణ

జానల్‌దిన్నె రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన బాత్రూం తలుపులు ఎత్తుకెళ్లిన దొంగలు

తలుపు పగులగొట్టిన ఆకతాయిలు

రైతువేదికలోని విద్యుత్ స్విచ్‌బోర్డులు దొంగిలించిన దృశ్యం

- సకల కార్యకలాపాలకు నిలయంగా జానల్‌దిన్నె రైతు వేదిక
- అటువైపు కన్నెత్తి చూడని వ్యవసాయ అధికారులు
- ఫ్యాన్లు, స్విచ్‌బోర్డులు, ఫర్నిచర్, బాత్రూం డోర్లు మాయం
- బీఆర్‌ఎస్ హయాంలో విశేష సేవలందించిన రైతు వేదికలు

నేరేడుచర్ల, ఏప్రిల్ 5: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసింది. ఉచిత విద్యుత్, పంటల సాగుకు పెట్టుబడి సాయం, వ్యవసాయానికి సరిపడా నీరు, సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు అందించి అండగా నిలిచింది. వీటితో పాటు పంటల సాగులో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను తీర్చడం, రైతులు, అధికారులు ఒకేచోట సమావేశమై చర్చించుకునేలా రైతు వేదికలను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి మండలంలో 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున జిల్లాలో 82 క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలను నిర్మించింది. ఒక్కొక్క రైతు వేదికకు రూ.22 లక్షలు కేటాయించి భవనాలను సర్వాంగ సుందరంగా నిర్మించింది. అందులోనే ఏఈఓలు ఉండి రైతులకు సాగు సమయంలో సలహాలు, సూచనలు ఇచ్చేలా ఏర్పాట్లు చేసింది. వాటి నిర్వహణ కోసం ప్రతి నెల రూ.9 వేల నిధులను విడుదల చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిధులు విడుదల కాకపోవడంతో రైతు వేదికల నిర్వహణ అధ్వానంగా మారింది.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 25 రైతు వేదికలు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 25 రైతు వేదికలను నిర్మించారు. కొన్ని రైతు వేదికలను అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నేరేడుచర్ల మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి నాలుగు రైతు వేదికలను నిర్మించారు. దిర్శించర్ల, చిల్లేపల్లి, కల్లూరు, జానల్‌దిన్నె గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించి ప్రతి మంగళవారం, శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించి పంటల సాగులో అనుసరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేవారు. కాగా, ప్రస్తుతం జానల్‌దిన్నె రైతు వేదిక సకల కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు రైతు వేదికను అనేక విధాలుగా వాడుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా రైతు వేదికకు ఉన్న మెయిన్ డోర్‌ను పగులగొట్టారు. ఫ్యాన్లు, విద్యుత్ స్విచ్‌బోర్డులు మొత్తం ఎత్తుకెళ్లిపోయారు. బాత్రూం డోర్లతో పాటు వాటిలో నల్లాలు, బేషిన్లు సైతం కనిపించడం లేదు. ఇతర ఫర్నిచర్, 40 కుర్చీలు, మైకులు దొంగిలించారు. ప్రస్తుతం రైతు వేదికలో ఏ వస్తువులు కూడా లేవు. ఇదే అదునుగా కొందరు గొర్రెల కాపరులు వాటిలో జీవాలను ఉంచుతున్నారు.

నిర్వహణకు నిధులు లేక..

రైతు వేదికల నిర్వహణ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి నెల రూ.9 వేలు విడుదల చేసింది. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గతంలో విద్యుత్ చార్జీలకు రూ.1000, తాగునీటి కోసం రూ. 500, స్వీపర్లకు రూ.3 వేలు, స్టేషనరీ, జిరాక్స్ ఖర్చులకు రూ. 1000, రైతు శిక్షణ శిబిరాలు, శానిటరీ, మినీ లైబ్రరీ ఖర్చులకు రూ.2,500, మరమ్మతులు, తదితరాలకు రూ. 1000 విడుదల చేసేవారు. ప్రస్తుతం ఆ నిధులు విడుదల కాకపోవడంతో ప్రతి నెల స్వీపర్లకు సొంతంగా డబ్బులు ఇస్తున్నామని ఏఈఓలు వాపోతున్నారు.

నిధులు లేవు

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రైతు వేదికలను నిర్వహించలేకపోతున్నాం. గతంలో అనేక మార్లు తలుపులు పగులగొడితే మరమ్మతులు చేపట్టాం. అయినా కొందరు ఆకతాయిలు రాత్రి సమయంలో తలుపులు పగులగొట్టి రైతు వేదికలోని ఫర్నీచర్‌తో పాటు తలుపులు, బాత్రూం డోర్లు, నల్లాలు, బేషిన్లు, స్విచ్‌బోర్డులు, విద్యుత్ వైర్లు సైతం దొంగిలించుకపోయారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతు వేదికలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

- జావీద్, నేరేడుచర్ల మండల వ్యవసాయాధికారి